# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

మంగళవారం | 19 మార్చి, 2024 | పేజీలు : 6




ప్రశాంతంగా ఎన్నికలు జరగాలి 5 లో

## త్వరితగతిన ప్రాజెక్టులు పూర్తి చేయాలి: సిపిఐ



ప్రజాపక్షం/నాంపల్లి: డిండి ఎత్తిపోతల, నక్కలగండి ద్వారా నీరు అందించే దిశగా కిష్టారాయినిపల్లి, చర్లగూడెం ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి మునుగోడు మరియు దేవరకొండ నియోజకవర్గాల ప్రజలకు సాగునీరు, త్రాగు నీరు అందించాలని, నాంపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాగిపని అంజాచారి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సిపిఐ మండల పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ ఇసాక్‌కు నాంపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు

తరువాయి 2లో



## భగత్ సింగ్,రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 93వ వర్ధంతి కరపత్రం ఆవిష్కరణ

3 లో

## ప్రజలను మోసం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు



### ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఫిర్యాదులు పరిశీలించిన జిల్లా ఎస్‌పి రాహుల్‌హెగ్డే

ప్రజాపక్షం / సూర్యాపేట: జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఎస్పీ రాహుల్‌హెగ్డే ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదులు తీసుకుని పరిశీలించారు. ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలు మూలల నుండి 9 ఫిర్యాదులు రాగా ప్రతి ఫిర్యాదుదారునితో మాట్లాడి ఫిర్యాదులు సంబంధిత అధికారులకు పంపించి ఫిర్యాదు వేగంగా చర్యలు తీసుకోవాలని,బాధితులకు భరోసా కల్పించాలని ఎస్పీ ఆదేశించారు. ఉద్యోగాలు, పథకాలు,బహుమతులు అంటూ అయామక ప్రజలను ఆర్ధికంగా మోసం చేసేవారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజలు ఇలాంటి వారిని నమ్మవద్దని ఉద్యోగాలు, పథకాలు, బహుమతులు వస్తాయంటే ఇతరులను ఎవరిని కూడా నమ్మి డబ్బు ఇవ్వవద్దని కోరారు.

**ఎఆర్ఎస్ఐ కుటుంబానికి ఆర్ధిక చేయూత :** సూర్యాపేట జిల్లా ఆర్మడ్ విభాగం బాంబ్ స్క్వాడ్ నందు పనిచేస్తున్న ఏఆర్ఎస్ఐ వెంకటయ్య అకాలంగా మరణించడం జరిగింది. దివంత పోలీస్ సిబ్బంది కుటుంబ అవసరాలు తీర్చడంలో భాగంగా పోలీస్ చేయూత పథకం ద్వారా రూ.2లక్షల చెక్కును జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే జిల్లా పోలీస్ కార్యాలయం నందు వెంకటయ్య కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది కుటుంబాల సంక్షేమం కోసం ఎల్లప్పుడు పోలీస్‌శాఖ కృషి చేస్తుందని చేయూత పథకం సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటున్నాయి అన్నారు. కార్యక్రమం

తరువాయి 2లో



# మొదలైన పది పరీక్షలు

### ప్రశాంతంగా ముగిసిన మొదటిరోజు

ప్రజాపక్షం / డిండి: డిండి మండల కేంద్రంలో పదవ తరగతి పరీక్షలు రెండు కేంద్రాలలో విద్యార్ధులు సోమవారం తెలుగు పరీక్షకు మండలంలోని 8 హైస్కూల్‌లతో పాటు కేజిబివి, ఆర్పిఆర్పి, మోడల్ పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. మొదటిరోజు పరీక్షకు ఆదర్శ పాఠశాల సెంటర్‌లో 154 మంది విద్యార్థులకు గాను 151 మంది విద్యార్థులు హాజరైయ్యారని మోడల్ స్కూల్ ఎగ్జామ్ చీఫ్ సూపరిండెంట్ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఆర్పీ ఆర్పీ గురుకుల పాఠశాలలో 218 మంది విద్యార్థులకు గాను 218 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆర్పీ ఆర్పీ పాఠశాల ఎగ్జామ్ చీఫ్ సూపరిండెంట్ పద్మ తెలిపారు. మండలంలో మొదటి రోజు 372 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 369 మంది విద్యార్థులు హాజరయ్యారని అన్నారు. పరీక్ష నిర్వహణను స్థానిక తహశీల్దార్ తిరుపతయ్య, మండల విద్యాధికారి సామ్యానాయక్‌లు పరిశీలించారు. డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌లుగా శ్రీనివాస్‌చారి, నాగలక్ష్మిలు వ్యవహరించారు. ఈనెల 18 నుండి ఏప్రిల్ 01 వరకు జరిగే పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లు తీసేందుకు అనుమతిని నిరాకరించి మూసివేయించారు.

**కొండమల్లేపల్లిలో..** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్సి




గురుకుల పాఠశాల, మెటిల్డా హైస్కూల్, నాగార్జున గ్రామర్ స్కూల్ పరీక్షా కేంద్రాలలో సోమవారం పది పరీక్షలు ప్రశాతంతంగా ప్రారంభమయ్యాయి. పాఠశాలల వద్ద ఎస్ఐ రామ్మూర్తి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సిబ్బందితో కలిసి పరీక్ష కేంద్రాలను సందర్శించి పర్యవేక్షించారు. ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డిలు పరీక్ష కేంద్రాలకు వెలుతున్న విద్యార్థులను కలిసి, వారితో ముచ్చటించి పరీక్షలకు భయపడకుండా వెళ్ళి ప్రశాంతంగా రాయాలని మనోధైర్యం కల్పించారు.

**నార్కట్‌పల్లిలో...** తెలంగాణ రాష్ట్రంలో మొదలైన పదవ తరగతి పరీక్షలు నార్కట్ పల్లి మండలంలో ప్రశాంతంగా జరిగాయి. సోమవారం మొదలైన తెలుగు భాష పరీక్షకు ఒక్కరు కూడా గైర్హాజరు కాలేదని నూరు శాతం విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి

తరువాయి 2లో

# ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూం ప్రారంభం

### వివిధ సమస్యలపై సత్వర పరిష్కారం

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్



**ప్రజాపక్షం / సూర్యాపేట కలెక్టరేట్:** జిల్లాలో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ బిఎస్ లత, సిఇవో అప్పారావుతో కలిసి ఎన్నికల ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూంను ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈసేల్ నందు సి విజిల్ 1950 కాల్ సెంటర్, సువిధా పర్మిషన్స్, ఎన్‌జిఆర్‌పి ఎస్, పోర్టల్ అలాగే పిడబ్ల్యూడి,సాక్షమ్ యాప్ అందుబాటులో ఉంటాయని అన్నారు. జిల్లా ప్రజలు లోక్ సభ ఎన్నికల్లో పలు సమస్యలు జరిగే సంఘటనపై సత్వరం పరిష్కారం దిశగా సంబంధిత యాప్‌ను అందుబాటులో ఉంచామని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కంట్రోల్ రూం నందు సిబ్బందికి విడతల వారిగా విధులు కేటాయించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎవో సుదర్శన్‌రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాసరాజు, ఇడిఎం గఫ్పార్ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

### ఎంపిపి మాడుగుల ప్రభాకర్ రెడ్డి



**ప్రజాపక్షం / భూదాన్ పోచంపల్లి:** మండల వ్యాప్తంగా ప్రజలకు మంచినీటి ఎత్తిడి రాకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి అధికారులను కోరారు. కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన అధ్యక్షతన ఎండిఓ ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ గ్రామాల వారీగా వివద్ధ శాఖలలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా సంబందిత అధికారులు అభివృద్ధి నివేదికలు సమర్పించారు. పలు ప్రణాళికలకు,తీర్మానాలకు ఆమోదం సర్వ సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, పిఎసిఎస్ చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి, ఎంపీడీవో ఆర్ భాస్కర్, ఎంపీటీసీ బత్తుల మాధవి శ్రీశైలం గౌడ్,బందారపు సుమలత గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, విస్తరణ అధికారి ఎండి మజీద్ సూపరింటెండెంట్ చంద్రమౌళి,ఇంజనీర్స్,అధికారులు,కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి నాయకుడికి ఒయు డాక్టరేట్

**ప్రజాపక్షం / మాడుగులపల్లి :** నల్లగొండ జిల్లా మాడుగులపల్లి గ్రామానికి చెందిన నర్సింహ ప్రాధమిక విద్యాభ్యాసం మాడుగులపల్లిలో ఇంటర్మీడియట్, డిగ్రీ శాంతి నికేతన్ కళాశాల మిర్యాలగూడలో, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ ఉస్మానియా యూనివర్శిటీలో పూర్తి చేసి జిఏటిఈ, సిఎస్ఐఆర్ ఫెలోషిప్ సాధించి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ హైదరాబాద్‌లో ప్రిన్సిపల్ సైంటిస్ట్ , డాక్టర్ ఎ. వెంకట నర్సయ్య పర్యవేక్షణలో స్టీరియో సెలెక్టివ్ సింథసిస్,ఆఫ్ లింగ్బిక్ యాసిడ్ డెరివేటివ్స్ ,సినకాల్ సెట్ అండ్ డెవలప్ మెంట్ ఆఫ్ సింథటిక్ మెథడాలజీస్ అనే అంశంపై పరిశోధన చేసి సమర్పించిన పరిశోధన గ్రంథాన్ని పరిశీలించిన అధికారులు నరసింహకు పి. హెచ్. డి పట్టా అందజేస్తున్నట్లు ప్రకటన విడుదల చేశారు. నరసింహ విద్యార్థి దశ నుండే చదువులోను బహుజన ఉద్యమాలలో చురుకుగా పాల్గొనేవారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. తను చదువుకుంటూనే ఎంతో మంది పేద విద్యార్థులకు సహాయం చేస్తూ భవిష్యత్ నాయకులను , అధికారులను తయారు చేస్తున్న మానవతావాది, ఉన్నత విలువలు కలిగిన మాడుగుల నరసింహకు డాక్టరేట్ రావడం పట్ల బి ఎస్ పి మాజీ రాష్ట్ర, అధ్యక్షులు డా. ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎస్ సి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి, ఐ. ఆర్ ఎస్. అధికారి కె.నాగరాజు కుటుంబ సభ్యులు గ్రామస్తులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డా నరసింహా మాట్లాడుతు తన తల్లిదండ్రులు, విద్యనేర్పిన గురువులు, నాకు ఎల్లవేళలా సపోర్ట్ చేసిన స్నేహితులు, గ్రామస్తులకు అందరికి కృతజ్ఞతలు తెలిపారు.



## అదుపుతప్పి దేవాలయంలోకి దూసుకెళ్లిన కారు



**ప్రజాపక్షం / భూదాన్ పోచంపల్లి:** కారు అదుపు తప్పి నల్ల పోచమ్మ దేవాలయంలోకి దూసుకెళ్లిన సంఘటన ఆదివారం మధ్య రాత్రి యాదాద్రి జిల్లా భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం అర్ధరాత్రి సుమారు రెండు గంటల ప్రాంతంలో సీత సంజయ్(24) తండ్రి సీత కృష్ణ సొంతంగా డ్రైవింగ్‌తో శుభ కార్యం నిమిత్తం వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో ఎస్సీ హాస్టల్ మూల మలుపు వద్ద అతి వేగంతో ఉన్న కారు అదుపుతప్పి ప్రక్కన్నే ఉన్న నల్ల పోచమ్మ దేవాలయం వద్ద ఉన్న లింగాన్ని పెకిలించుకొని దేవాలయంలోకి దూసుకెళ్లి పిల్లర్ ను ఢీకొట్టింది. స్వల్ప గాయాలతో డ్రైవర్ బ్రతికి బయటపడ్డాడు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## ఘనంగా వెంకటేశ్వర స్వామి లక్ష పుష్పార్చన

**ప్రజాపక్షం / భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మండల పరిధిలో కనుముకుల గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ పద్మావతి సమేత స్వామి 21వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం లక్షపార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జడ్పీటిసి కోట పుష్పలతా మల్లారెడ్డి ఆధ్వర్యంలో హోమం బలిహరణం తీర్థప్రసాద వితరణ విశేష ఆరగింపు జరిగిన ఈ కార్యక్రమంలో కర్తలచే పూజా తంతులను చేశారు.భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నిర్మాణ కర్త కోట మల్లారెడ్డి, కోట సత్తిరెడ్డి సంపూర్ణ బోయపల్లి పురుషోత్తం రెడ్డి పుష్పలత దేవరపల్లి నర్సిరెడ్డి లక్ష్మీ దేవి నోముల భీమ్ రెడ్డి విజయలక్ష్మి నెలికంటి పర్వతాలు బసవమ్మ మారోజు శ్రీనివాసచారి సునీత ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## పూర్తి చేయాలి: సిపిఐ

(మొదటి పేజీ తరువాయి)

కామ్రేడ్ అంజాచారి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయ లబ్ది కోసం ఉత్తర తెలంగాణ ప్రాంతాన్ని మాత్రమే అభివృద్ధి చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అన్ని అనుమతులు పొందిన డిండి ఎత్తిపోతల, నక్కలగండి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా చిత్తశుద్ధి లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు నిరుపయోగంగా మార్చారని, ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆయన ఆరోపించారు. వర్షాలు లేక బోరు బావులు ఎండిపోయి రైతులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు సాగు చేస్తున్న వరి పంటలు, వేరుశనగ, పుచ్చకాయ, మొక్కజొన్న పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, పశుగ్రాసం లేక త్రాగడానికి నీరు లేక ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నాంపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, సహాయ కార్యదర్శులు ఊరుపాక వెంకటయ్య, రాజు, మండల కార్యవర్గ సభ్యులు సత్తయ్య, వెంకటయ్య, యాదయ్య, లక్ష్మ య్య, ఇద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

## చట్టపరమైన చర్యలు తప్పవు

(మొదటి పేజీ తరువాయి)

నందు అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, పోలీస్ సంఘం అధ్యక్షులు రామచందర్‌గౌడ్, సంఘం సభ్యులు కృష్ణ, సంక్షేమ ఆర్ఐ నర్సింహ పాల్గొన్నారు. మిని వాటర్ కూలర్‌ను అందించిన బ్యాంక్ ఆఫ్ బరోడా జిల్లా పోలీస్ కార్యాలయం నందు ప్రజావాణి హాల్‌కు మినీవాటర్ కూలర్‌ను సూర్యాపేట పట్టణ బ్యాంక్ ఆఫ్ బరోడాశాఖ వారు బహుకరించారు.ప్రజావాణి హాల్ నందు వాటర్‌కూలర్‌ను ఎస్పీ ప్రారంభించి మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ బరోడా సూర్యాపేటశాఖ వారిని అభినందించారు. ఇది ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదుదారులకు, కార్యాలయానికి వచ్చే సిబ్బందికి చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్‌రెడ్డి, ఆర్ఐలు నారాయణరాజు,నర్సింహ,బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బంది పాల్గొన్నారు.

# మొదలైన పది పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)



కుకూట్ల నరసింహ తెలిపారు. నార్కట్‌పల్లి పట్టణంలో మూడు పరీక్ష కేంద్రాలు, అమ్మనబోలు, బ్రాహ్మణ వెల్లెంల గ్రామాలలో రెండు కేంద్రాలలో కలిపి 696 విద్యార్థులు గాను 696 మంది పరీక్ష రాసినట్లు ఆయన తెలిపారు. నార్కట్ పల్లి ఎస్ఐ అంతి రెడ్డి ఆధ్వర్యంలో 144 సెక్షన్ ను సెంటర్ల వద్ద అమలు చేయడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. విద్యార్థులు పరీక్షను ప్రశాంత వాతావరణంలో రాసినట్లు విద్యార్థులు పేర్కొన్నారు.



**అడ్డగూడూరులో...**అడ్డగూడూరు అవాసగ్రామం మంగమ్మగూడెం మహిళా గురుకుల పాఠశాలలో పదవ తరగతి పరిక్షలు సోమవారం ఉదయం మొదలైనాయి. మండలంలోని హైస్కూలు తోపాటు కోటమర్తి, చౌల్లరామారం, ఆజీంపేట, డి రాపాక, కంచనపల్లి కస్తూరిభా గాంధీ, మంగమ్మగూడెం గురుకుల పాఠశాలల నుండి 181 మంది విద్యార్థిని, విద్యార్థులు, పదవ తరగతి పరిక్షలకు హజరైనారు. శ్రీనివాస్‌రెడ్డి డిఒ ఆధ్వర్యంలో పటిష్టంగా నిర్వహించారు. స్కాడ్ కృష్ణ తనిఖీ నిర్వహించారు. పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు.

**ఆలేరులో...** ఆలేరు మండలంలోని మూడు రక్ష కేంద్రాలలో పదో తరగతి తెలుగు పరీక్ష అన్ని పరీక్ష కేంద్రాలలో సజావుగా జరిగాయని మండల విద్యాధికారి కృష్ణ అన్నారు. సోమవారం ఆలేరు మండలంలో విద్యాధికారి మాట్లాడుతూ ఆలేరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 240 మంది విద్యార్థులకు 240 మంది విద్యార్థులు హాజరైనారు. జెయంజె హై స్కూల్లో 239 మంది విద్యార్థులకు 239 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. రామకృష్ణ విద్యాలయంలో 192 మంది విద్యార్థులకు 189 మంది విద్యార్థులు హాజరైనారు. ముగ్గురు విద్యార్థులు హాజరు కాలేదని పేర్కొన్నారు.

**మోటకొండూర్‌లో...** మోటకొండూరు మండల కేంద్రంలో పదవ తరగతి పరిక్షలు ప్రారంభం అయ్యాయి. మండలంలోని వివిద గ్రామాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో చదివే 227 మందికి 227 మంది విద్యార్థులు హజరై పది పరీక్షలు రాసినట్లు అదికారులు తెలిపారు.



### పదవ తరగతి పరీక్షల నిర్వహణను పరిశీలించిన కలెక్టర్:

**యాదాద్రి భువనగిరి ప్రతినిధి:** సోమవారం నుండి ప్రారంభం అయిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి జిల్లాలోని 51 పరీక్షా కేంద్రాలలో 9159 మంది విద్యార్థులకు గాను 9134 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, 25 మంది గైర్హాజయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి కె.నారాయణరెడ్డి చెప్పారు. జిల్లా లోనియాదగిరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూలు పరీక్షా కేంద్రంలో పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టరు హనుమంతు కే.జెండగే, డిప్యూటీ పోలీసు కమిషనర్ రాజేశ్ చంద్ర పరిశీలించారని తెలిపారు.

### పదవ తరగతి పరీక్షలలో మాస్ కాపీయింగ్ పాల్పడితే చర్యలు: ఆర్‌డిఒ శేఖర్ రెడ్డి



**భూదాన్ పోచంపల్లి:** మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రాలలో 10వ తరగతి పరీక్షలలో అవకతవకలకు పాల్పడకుండా మాస్ కాపీయింగ్ కు తావులేకుండా విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసేలా చూడాలని చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి చీఫ్ సూపరింటెండెంట్స్‌ను కోరారు. సోమవారం పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఆయన పేపర్ లీకేజీలు గాని పరీక్ష ప్రారంభమైన సమయం నుంచి సమాధాన పత్రాల బండిల్స్ పోస్ట్ ఆఫీస్ చేరేవరకు అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులకు ఎమర్జెన్సీ సర్వీసులను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల 210 బాలికల పాఠశాలలో 150 మంది కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో 176 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. ఎమ్మార్వో బేగంపేట్ శ్రీకాంత్ రెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకట్ రెడ్డి, చీఫ్ చీప్ సూపరింటెండెంట్స్ రాజారెడ్డి రమాదేవి యాదగిరి ఆయన వెంట ఉన్నారు.

# ఆంధ్రా నుంచి ధాన్యం రాకుండా అడ్డుకుంటాం: జెసి

**ప్రజాపక్షం / మిర్యాలగూడ:** ఆంధ్రా ప్రాంతం నుంచి తెలంగాణ వైపు ధాన్యం రాకుండా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి అడ్డుకుంటున్నామని జేసీ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం రైస్ మిల్లర్స్ అసోసియేసణ్ భవనంలో మిల్లర్లతో సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ధాన్యం దిగుమతుల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగించకుండా మిల్లర్లు అర్థం చేసుకోని సాధ్యమైనంతవరకు సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అనేక ప్రతికూల పరిస్థితుల నడుమ రైతులు పంటలు సాగు చేశారని, కొనుగోలు విషయంలో వారిని ఇబ్బందులకు గురి



చేయవద్దన్నారు. వ్యవసాయ, మార్కెటింగ్, మిల్లర్స్‌తో సంయుక్తంగా ప్రత్యేక మొబైల్ బృందాలను ఏర్పాటు చేసి ధాన్యం దిగుమతులు సకాలంలో జరిగేలా చూడాలన్నారు. ఏ సమయంలోనైనా ధాన్యం ట్రాక్టర్లు మిల్లుల వద్దకు వచ్చిన వెంటనే దిగుమతి అయ్యేలా చూడాలన్నారు. 48 గంటల్లో రైతుల సమస్యలు పరిష్కారం కాకుంటే గతంలో మాదిరిగానే టోకెన్ విధానాన్ని అమలు చేస్తామన్నారు. సమావేశంలో డీఎస్‌వో వెంకటేశ్వర్లు, డీసీఎంఎస్ నాగేశ్వర్‌రావు, జిల్లా వ్యవసాయ సంచాలకులు శ్రవణ్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ హరిబాబు, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రామకృష్ణ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, వెంకటరమణచౌదరి, రేపాల మధుసూదన్, బండారు కుశలయ్య, ధనమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం / మర్రిగూడ:** మండలంలోని తమ్మడపల్లి గ్రామానికి చెందిన మొగిలి లక్ష్మమ్మ సోమవారం మరణించడంతో అంత్యక్రియలకు ఖర్చుగాను ఆమె భర్త మొగిలి యాదయ్యకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకల జగన్ రెడ్డి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఈడేగోని వెంకటేష్ యాదవ్, మండల కోశాధికారి ఓంకార్ యాదవ్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య యాదవ్, పుల్లయ్య, సతీష్, కృష్ణయ్య ఉన్నారు.

## చైర్మన్ మన్నె సతీష్‌కు ఘనంగా సన్మానం



**ప్రజాపక్షం / దేవరకొండ :** తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన టిపిసిసి సోషల్ మీడియా చైర్మన్ మన్నె సతీష్‌కు సోషల్ మీడియా టీం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీపీసీసీ నియోజకవర్గ సోషల్ మీడియా దేవరకొండ నియోజకవర్గం కోఆర్డినేటర్,నర్ర బాలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అని వర్గాలకు సమూచిత స్థానం కల్పిస్తుందన్నారు. సతీష్‌కు టెక్నాలజీ సర్వీసెస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు.

## బిజెపితోనే దేశాభివృద్ధి

**ప్రజాపక్షం/ఆలేరు :** బిజెపితోనే దేశాభివృద్ధి జరుగుతుందని బిజెపి మండల అధ్యక్షుడు పూజారి కుమార్ స్వామి అన్నారు సోమవారం ఆలేరు మండలంలోని కమలమ్మ జనార్ధన్ ఫంక్షన్ హాల్లో బిజెపి పార్టీ నూతన మండల కమిటీ ఎన్నిక సందర్భంగా వారు మాట్లాడారు మండల ప్రధాన కార్యదర్శిగా అంకిరెడ్డి శ్రీనివాస్ ఉపాధ్యక్షులుగా మాసాపేట రాజు గౌడ్ సుధ గాని సురేష్ కంతి రవి కార్యదర్శులుగా పరిదే కరుణాకర్ నేరెళ్ల రాజు కార్యవర్గ సభ్యులుగా కృష్ణ రమ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు నూతనంగా ఎన్నుకున్న వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుదగాని రాజు భోగ శ్రీనివాస్ జాలపు లక్ష్మి సురేందర్ రెడ్డి శంకర్ కిషన్ పరశురాములు కిషోర్ నాగేష్ శంకర్ స్వామి భరత్ కృష్ణ మధు హరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల
# 93వ వర్ధంతి కరపత్రం ఆవిష్కరణ

**ప్రజాపక్షం /వలిగొండ :** అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 93 వ వర్ధంతి సందర్భం మండలంలోని దుప్పల్లి గ్రామంలో, ఏఐవైఎఫ్ స్తూపం వద్ద ప్రచార కరపత్రం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ భగత్ సింగ్,రాజ్ గురు, సుకుదేవ్ ల వర్ధంతి సందర్భంగా వలిగొండ మండల ఏఐవైఎఫ్, అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 23 వ తేదీ నుండి ప్రారంభం వలిగొండ మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ . ఆరూరు గ్రామంలో నిర్వహించడం జరుగుతున్నది యువతను ప్రోత్సహించేందుకు వారిలో ఉన్న క్రీడ నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఏఐవైఎఫ్ వలిగొండ మండలంలోని మండల స్థాయి క్రికెట్ పోటీలను ఏర్పాటు చేస్తున్నదని క్రీడాకారులను ఆహ్వానిస్తున్నాము అని అన్నారు. భగత్ సింగ్ జీవితం భారత దేశ యువతకు స్ఫూర్తిదాయకమని, అటువంటి మహనీయుని త్యాగాలను నేటి సమాజానికి తెలపాల్సిన భాద్యత పాలకులదేనని వారు ఉద్ఘాటించారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల వర్ధంతిని కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించాలని వారు డిమాండ్ చేశారు. 75సంవత్సరాలు గడిచినా ప్రజలకు పూర్తి స్థాయి మౌలిక వసతులు ఎందుకు కేటాయించలేకపోతున్నారో చెప్పాలని వారు



డిమాండ్ చేశారు. దేశ అభివృద్ధి అంటే మతాల మధ్య చిచ్చుపెట్టడమేనా అని వారు మోడీని ప్రశ్నించారు. దేశ ప్రధాని ప్రభుత్వ రంగ సంస్థలను, దేశ వనరులను యథేచ్ఛగా కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేశారని ఆరోపించారు. అందుకే మోసాల మోడీని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి ఇంటికి సాగనంపాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంలోనే భగత్ సింగ్ దేశానికి బ్రిటిష్ ముష్కరులతో పోరాడి స్వాతంత్ర్యం తీసుకువస్తే, మోడీ ప్రజలను మోసం చేయడంలో, ప్రజల మధ్య చీలికలు తేవడంలో సిద్ధహస్తుడయ్యాడని వారు ఎద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.డి నయీమ్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి లు ఎర్ర కిరణ్, సుద్దాల సాయికుమార్, ఏఐవైఎఫ్ మండల సమితి సభ్యులు మేడి దేవేందర్, మెట్టు లక్ష్మి నారాయణ, మామిడికాయల నరేష్, బాలగోని రాజు,మారోజు నరసిమాచారి, అంతటి రాము, రాపోల్ పవన్, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి నరిగే యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వంద రోజుల పాలనలో పురోగతి లేదు

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్:** ఆరు గ్యారెంటీల స్కీం అబద్దాల స్కీం అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది కానీ కాంగ్రెస్ వంద రోజుల పాలనలో పురోగతి లేదని నల్లగొండ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి ఆరోపించారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు తాండవిస్తుంది ధాన్యం కొనుగోళ్ల పై సమీక్ష లేదు రైతులంతా అయోమయంలో ఉంటే పట్టించుకునే నాథుడు లేడు అని విమర్శించారు. నల్లగొండ పార్లమెంట్‌లో త్వరలో చక్కటి మేనిఫెస్టోతో ప్రజల్లోకి వెళ్తా కాషాయ జెండా ఎగరడం ఖాయమని తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా




అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, నాయకులు కంకణాల నివేదిత రెడ్డి, పోతేపాక లింగస్వామి, మిరియాల వెంకటేశం, మండల వెంకన్న శిరీష, దాయం భూపాల్ రెడ్డి, వంగూరి రాఖీ, నిమ్మల రాజశేఖర్ రెడ్డి, కంకణాల నాగిరెడ్డి, కౌన్సిలర్ బొజ్జ నాగరాజు, గడ్డం మహేష్ పాల్గొన్నారు.

## తిమ్మారెడ్డి గూడెంలో పోషణ అభియాన్

**ప్రజాపక్షం/వేములపల్లి:** మండలంలోని తిమ్మారెడ్డి గూడెం గ్రామంలో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఈసీసీ డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ నిర్మల మాట్లాడుతూ మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు ఆటపాటల ద్వారా అంకెల పద్ధతి ద్వారా విద్యను అలవాటు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి రోజు టైం ప్రకారం ప్రీ స్కూల్ కార్యక్రమం నిర్వహిస్తూ అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారంతోపాటు నర్సరీ ఎల్కేజీ యూకేజీ సిలబస్‌ను బోధిస్తున్నామని




అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా లింగమ్మ గర్భిణీలు కళ్యాణి, శృతి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిఒపై జరిగిన దాడికి నిరసన తెలిపిన ఉద్యోగులు



**ప్రజాపక్షం / డిండి:** నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు మండల ఎంపిఓపై జరిగిన దాడికి నిరసనగా సోమవారం గుండ్లపల్లి ఎంపిడివో, ఎంపివో, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపిడివో ఎస్డి డానియల్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వంలో అన్ని శాఖల కంటే అత్యధికంగా ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తున్న పంచాయతీరాజ్ శాఖ అలాంటి శాఖ ఎంపిఓపై ఎంపిపి దాడి చేయడం అమానుషం అని అన్నారు. పంచాయతీ రాజ్ శాఖలో అతి ముఖ్యమైన మండల పంచాయతీ అధికారిపై మండల పరిషత్ అధ్యక్షులు దాడి చేసి కొట్టడం అమానుషం అని మరల ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దాడి చేసిన ఎంపిపిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపివో రమేష్, సినియర్ అసిస్టెంట్ శివానందం, ఏపివో జయరాజ్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎపిఎంగా కె.పురుషోత్తం బాధ్యతలు స్వీకరణ



**ప్రజాపక్షం/డిండి:** డిండి ఏపిఎంగా కేతావత్ పురుషోత్తం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నియోజకవర్గంలో నేరేడుగొమ్ము మండలం ఏపిఎంగా పనిచేసిన పురుషోత్తం బదిలీపై డిండి రావడంతో, డిండి ఏపిఎంగా పనిచేసిన నాగలీల బదిలిపై నేరేడుగొమ్ము మండలానికి బదిలిపై వెళ్ళారు. బాధ్యతలు స్వీకరించిన ఏపిఎం పురుషోత్తం మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను, అందించే రుణాలను సంఘాలకు చేరవేసేందుకు గాను, సంఘాల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. మహిళా సంఘాల్లోని మహిళలను ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులేసేందుకు సంబంధింత సిబ్బంది పనిచేయాలని సూచించారు. అనంతరం సిసిలు, సిబ్బంది ఏపిఎం ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో సిసిలు లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, మల్లేష్, ఆంజనేయులు, సిబ్బంది శారద, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో కోళలు చప్పట్లు సందడి



**ప్రజాపక్షం / అడ్డగూడూరు:** మండలంలోని పలు గ్రామాల్లో చిన్నారులు కోళలు, చప్పట్లతో ఇల్లుఇల్లు తిరుగుతూ సందడి చేస్తున్నారు. ఈ విధంగా తొమ్మిది రోజులు తిరిగి పదవరోజు హోళీ పండుగ జరుపుకుంటూరు. ఈ పండుగ పూర్వం నుండి వస్తోంది.

## పూసపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలి



**ప్రజాపక్షం / ఆలేరు :** కేంద్ర రాష్ట్ర జిల్లా స్థానిక నాయకత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారాన్ని కొచ్చి రాగానే పూసపల్లి కుట్ర కేసు ను భరాయించిందని ఇది అత్యంత దుర్మార్గమైనదని ప్రజాపాలనగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ పాలన బిజెపి టిఆర్ఎస్ పాలనల కొనసాగింపు కు నిదర్శనమని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మామిడాల బిక్షపతి అన్నారు. సోమవారం ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో న్యూ డెమోక్రసీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కమిటీ విడుదల చేసిన పోస్టులను ఆవిష్కరించి సందర్భంగా మాట్లాడారు ఈ కార్యక్రమంలో నాయకులు అడివయ్యా గడ్డం నాగరాజు ఇక్కిరి సహదేవ్ సిద్ధులు టంగుటూరు మాజీ సర్పంచ్ సమరసింహ్ రెడ్డి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు చేయకుంటే కఠిన చర్యలు తప్పవు

ఎంఎల్ఎ లక్ష్మారెడ్డి



ప్రజాపక్షం / మిర్యాలగూడ: ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హెచ్చరించారు. సోమవారం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యానికి సరైన మద్దతు ధర చెల్లించకుండా రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. సీజన్ ప్రారంభంలో రూ.2700 ధర చెల్లించిన మిల్లర్లు ఒకేసారి ధర తగ్గించడం సమంజసం కాదన్నారు. రూ.2500 ధర ఇచ్చే విధంగా చూడాలన్నారు. నామమాత్రంగా కొంత మంది మిల్లర్లే ధాన్యం కొనుగోలు చేస్తున్నారని, దీని వల్ల రోజుల తరబడి రైతులు మిల్లుల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. మొక్కుబడిగా ధాన్యం కొనుగోలు చేసే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేసి సకాలంలో బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. సమావేశంలో రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

## మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసిన రెడ్డి సంఘం నాయకులు



ప్రజాపక్షం / ఆలేరు : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్డి సామాజిక వర్గానికి కార్పొరేషన్ ప్రకటించిన సందర్భంగా ఆలేరు మండలంలోని రెడ్డి సంఘం నాయకులు సోమవారం రోడ్డు రవాణా శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు అనంతరం కార్పొరేషన్కు సహకరించిన సీఎంకు ఉప ముఖ్యమంత్రి మంత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లారెడ్డి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు జాలపు వనజ యాదాద్రి జిల్లా అధ్యక్షులు వెంకటరెడ్డి నల్గొండ జిల్లా అధ్యక్షులు మంగారెడ్డి ఆలేరు నియోజకవర్గం అధ్యక్షులు గాదె సోమిరెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు సావిత్రి మోటకొండూరు మండల అధ్యక్షులు అంజిరెడ్డి మహిళా నాయకురాలు పద్మరాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కురుమ సంఘం ఆలేరు మండల అధ్యక్షుడుగా పర్వతాలు



ప్రజాపక్షం / ఆలేరు : ఆలేరు మండలం శారజిపేట గ్రామానికి చెందిన బండ పర్వతాలు కురుమ సంఘం మండల అధ్యక్షులుగా సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఉపాధ్యక్షులు గా బండి నాగయ్య మల్లేష్ వీర మల్లేష్ బిక్షపతి ప్రధాన కార్యదర్శిగా జూకంటి రమేష్ సహాయ కార్యదర్శిగా శ్రీశైలం బిక్షపతి శ్రీశైలం కోశాధికారి గా బుగ్గ మహేందర్ కరికే మల్లేష్ రమేష్ కార్యవర్గ సభ్యులు రమేష్ సోములు సాయిలు రాము పాండు రాజు ఐలయ్య లు ఎన్నికయ్యారు సందర్భంగా ఎన్నికైన వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎగిడి శ్రీశైలం నాయకులు పిక్క శ్రీనివాస్ పే రేపు రాములు కూల నర్సింలు జటాసిదులు కూళ్ల సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

## నమ్మిన సిద్ధాంతాలకు చివరి వరకు కట్టుబడి ఉన్న ఎల్లయ్య



ప్రజాపక్షం / రామన్నపేట: కడవరకు నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన కమ్యూనిస్టు నాయకుడు మునుకుంట్ల ఎల్లయ్య అని సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు గాదె నరేందర్ అన్నారు. సీపీఎం సీనియర్ నాయకుడు మునుకుంట్ల ఎల్లయ్య మూడవ వర్ధంతి సందర్భంగా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్మారక స్థూపం వద్ద జోహార్లు అర్పించి కళాకారులు పాటలు పాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఉన్నత భావాలను కమ్యూనిస్టు కార్యకర్తగా ఎదిగి పట్టణ కేంద్రంలో పేదల సమస్యలపై ఉద్యమాలు నిర్వహించి అనేక మంది కార్యకర్తలను తయారు చేశారన్నారు. భూమిలేని పేదలకు భూమి పంచాలని, కూలీ రేట్లు పెంచాలని, సారా వ్యతిరేక ఉద్యమంలో ముందుండి నడిపారన్నారు. గీత కార్మిక సంఘంలో అనేక బాధ్యతలు చేపట్టి గీత వృత్తి పరిరక్షణ కోసం గీత కార్మికుల సంక్షేమం కోసం ఉద్యమించారన్నారు. నిత్య అధ్యయన శీలిగా, మార్క్సిస్టు దృక్పథాన్ని అలవరుచుకొని కడదాక నిబద్ధత కలిగిన కార్యకర్తగా ఎల్లయ్య ఉన్నారన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజా సమస్యలపై మరిన్ని పోరాటాలు చేయాలన్నారు. సీపీఎం నాయకులు కందుల హనుమంతు, బావండ్లపల్లి బాలరాజు, కల్లూరి నగేష్, వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, నాయకులు గొరిగె సోములు, సత్యం, పీఎన్ఎం నాయకులు ముత్యాలు, మునికుంట్ల లెనిన్, గంజి అశోక్, రాసాల రమేష్, వెంకట్‌రెడ్డి, అనిత, రూప తదితరులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వరుని సేవలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట: కలియుగ వైకుంఠం మన తెలంగాణలో శ్రీ సంకల్ప సిద్ధి వెంకటేశ్వర స్వామి వారి ఆలయమని ప్రభుత్వ విప్ ఆలేరు ఎంఎల్ఎ బీర్ల ఐలయ్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం రేణికుంట గ్రామంలో నూతన శ్రీ సంకల్ప వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రారంభ వేడుకలో ఆయన సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు పూర్ణకుంభ స్వాగతం పలికి ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం శ్రీ సంకల్ప వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేసి స్వామి వారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు.

### మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవంలో...

బొమ్మలరామారం : మండలంలోని పెద్ద పర్వతాపురం గ్రామంలో నిర్వహిస్తున్న మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవంలో సోమవారం ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్లఐలయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు ఆర్‌టిసిలో హాఫ్ టికెట్ ఇవ్వాలి



ప్రజాపక్షం / మోటకొండూర్: తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వికలాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి వికలాంగులను ఆదుకోవాలని వికలాంగుల సంఘం రాష్ట్ర నాయకులు అంతుల ఎల్లారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన మోటకొండూరు మండల కేంద్రంలో విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉన్నత అధికారులు వికలాంగుల సంక్షేమం కోసం పాటుపడాలని కోరారు. వికలాంగులకు బస్సులలో హాఫ్ టికెట్ ఇవ్వట్లేదని, ఫుల్ టికెట్ 90 రూపాయలు ఉంటే వికలాంగులకు 45 ఉండాలి కానీ 60 రూపాయలు తీసుకుంటున్నారని, వికలాంగులకు అదనంగా 15 రూపాయలు భారం పడుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల మోటకొండూరు మండల అధ్యక్షులు భువనగిరి నర్సింగరావు, రేగు లింగం, ఉపేందర్, జంగవెల్లి రాజయ్య, సదానందం, బీరకాయల రమణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ గొర్రెల పెంపకందారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాపక్షం / రామన్నపేట: మండలంలోని కొమ్మాయిగూడెం శ్రీకృష్ణ గొర్రెల పెంపకం దారుల సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తిరుపాల మల్లయ్యయాదవ్, కార్యదర్శిగా బెల్లి లింగస్వామి, ఉపాధ్యక్షులు రేపాక లింగస్వామి, డైరెక్టర్లుగా సొగల్ల శేఖర్, బుర్ర శ్రీశైలం, మచ్చ మహేష్, జాల చంద్రయ్య, మారమ్మ, లలితలు ఎన్నికయ్యారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు



ప్రజాపక్షం / రామన్నపేట: పదవ తరగతి పరీక్షలు మండలంలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు 416 మంది ఉన్నారు. వీరి కోసం మండలంలో 3 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారం జరిగిన పరీక్షకు గాను 416 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఒక విద్యార్థి మాత్రమే గైర్హాజరయ్యారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించే ముందు వారిని తనిఖీలు చేసి పంపించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతోపాటు పరీక్షా కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఎంఈవో శ్రీధర్ పరీక్షా కేంద్రాల ఇన్‌చార్జిలకు సూచించారు.

### గట్టు నిఖిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ

తుర్కపల్లి: మండలంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గట్టు నిఖిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ గట్టు తేజస్వి నిఖిల్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం వద్ద 175 మంది,రాంపూర్ మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రం వద్ద 195 మంది విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు అందచేయడం జరిగిందని, విద్యార్థులు ఒత్తిళ్ళకు లోనుకాకుండా బాగా చదివి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. మండలానికి ,తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని రాబోవు కాలంలో విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాదాపురం మాజీ ఉపసర్పంచ్ సీతరాజు, భూసాని వెంకటేష్, జూకంటి శ్రీకాంత్, మహదేవుని భానుప్రకాష్, ఎరుకల శ్రీకాంత్, పసగట్ల శ్రీకాంత్, గుంటి సాయి, పుల్లెల లక్ష్మీ కాంత్, భాస్కర్, షాదుల్లా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## యాదాద్రిని సందర్శించిన నేషనల్ డిఫెన్స్ కాలేజీ బృందం



ప్రజాపక్షం / యాదగిరిగుట్ట: నేషనల్ డిఫెన్స్ కాలేజీ, న్యూఢిల్లీ ద్వారా దేశ, విదేశాలకు చెందిన 16 మంది సభ్యుల బృందం మేజర్ జనరల్ ఎ.కె.సింగ్ ఆధ్వర్యంలో స్టడీ టూర్ ఎకనామిక్ సెక్యూరిటీ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని సోమవారం దర్శించుకుంది. జిల్లా కలెక్టరు హనుమంతు కే.జెండగే, డిప్యూటీ పోలీసు కమీషనర్ రాజేశ్ చంద్ర వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం 16 మంది సభ్యుల డిఫెన్స్ బృందం ఆలయ పరిసరాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు గంగాధర్, యాదగిరిగుట్ట దేవస్థాన కార్యనిర్వహణ అధికారి ఎ.భాస్కరరావు, భువనగిరి ఆర్.డి.ఓ.అమరేందర్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కరపత్రం ఆవిష్కరణ

ప్రజాపక్షం / ఆలేరు : సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ మురిగాడి మైసన్న 12 వర్ధంతి సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆలేరు పట్టణ కేంద్రంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు బొమ్మకంటి సిద్దిరాజు సోమవారం కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు ఈ కార్యక్రమంలో యాదగిరి శ్రైలం చందర్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మండల అధ్యక్షుడిగా దాచేపల్లి రాజు

ప్రజాపక్షం/యాదగిరిగుట్ట: భారతీయ జనతా పార్టీ రాజాపేట మండల అధ్యక్షుడిగా దాచేపల్లి రాజు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్ నియామక పత్రాన్ని సోమవారం అందజేశారు. బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరి అశోక్ గౌడ్, పాల సెంటర్ చైర్మన్ గాండ్ల నర్సింగరావు, ఓబీసీ మోర్చా కార్యదర్శి చలమల్లపల్లి లక్ష్మణ్, రేణిగుంట ఉపసర్పంచ్ శేఖర్ రెడ్డి. చల్లూరు ఉప సర్పంచ్ శ్రీనివాస్, బిజెపి జిల్లా గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి శ్రీను నాయక్, సీనియర్ నాయకులు కానుగంటి శ్రీనివాస్ రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కస్తూరి మాధురి తదితరులు ఉన్నారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన 10వ తరగతి పరీక్షలు



ప్రజాపక్షం/అనంతగిరి: మండలంలోని త్రిపురవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో పదవతరగతి పరీక్షలు సోమవారం మొదటిరోజు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈవో సలీం షరీఫ్ తెలిపారు.విద్యార్థులకు అవసరమైన మంచినీళ్లు,మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచామన్నారు. మొదటిరోజు 89 విద్యార్థులకు గాను మొత్తం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఎంఈవో తెలిపారు.

## క్రీడల సాధనతో శారీరక మానసిక వికాసం



ప్రజాపక్షం/కోదాడ: క్రీడల సాధనతో మానసిక వికాసం కలుగుతుందని పట్టణ సిఐ రాము, ప్రముఖ వైద్యులు సుబ్బారావు అన్నారు. సోమవారం పట్టణంలో ఫ్రెండ్స్ షటిల్ క్లబ్‌ను ప్రారంభించి మాట్లాడారు. శారీరక వ్యాయామానికి షటిల్ క్రీడ ఎంతో మంచిదన్నారు. అనంతరం క్రీడా దుస్తులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తోట రంగారావు, కౌన్సిలర్ మధు, చందా శ్రీనివాసరావు, ఫ్రెండ్స్ షటిల్ క్లబ్ మెంటర్స్ చందా శ్రీనివాసరావు, అడ్వకేట్ హనుమంతరాజు, డాక్టర్ రవికుమార్,పల్లా వెంకటేశ్వర్లు, నెల్లూరు సతీష్,మద్దూరి వెంకటరెడ్డి, పోలూరి శ్రీను, చెవుల శ్రీను,రామకృష్ణ, కొల్లు శ్రీను,రమేష్ పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక సంద్రంలో కోదాడ



ప్రజాపక్షం/కోదాడ: పట్టణంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ప్రతిష్ఠ మహోత్సవాల సందర్భంగా పట్టణంలో పండుగ వాతావరణం అలుముకుంది. బుధవారం ధ్వజ స్తంభం,మహాఅన్నదానాలు, ప్రత్యేక పూజలు ఉండటంతో ఇప్పటికే బంధువులతో ఇండ్లు కిటకిటలాడుతున్నాయి. పుట్టింటి వారికి మెట్టినింటి వారికి బట్టలు పెట్టాలని సాంప్రదాయంలో కోదాడ వాసులు ఉన్నారు. కాగా మూడవరోజు సోమవారం యాగశాల 18 హోమగుండాల వద్ద దంపతులు యాగ కార్యక్రమాలను నిర్వహించారు. రుద్రాభిషేకం, రుద్రహోమం, విశ్వక్సేన పూజ, సుప్రభాతం, ప్రభాత పారాయణం, వేద పారాయణం, క్షీరాధివాసం వంటి విశేష పూజలు నిర్వహించారు.స్వామివారు జగన్మోహిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మోహిని ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు నాగుబండి రంగా, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

# రజక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ప్రజాపక్షం/నేరేడుచర్ల: కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్ లను ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని అలాగే రజకులకు కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని సూర్యాపేట జిల్లా రజక సంఘం నాయకులు చిలకరాజు శ్రీను రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం రజక సంఘం నాయకులు కొమ్మరాజు వెంకటేత్‌తో కలసి ఆయన మాట్లాడారు. సమాజంలో అత్యంత వెనుకబడిన రజకులను ఆదుకోవడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని,రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి వారికి సామాజికంగా, రాజకీయంగా,ఆర్థికంగా పాలకులు అండగా నిలబడాల్సిన సమయంలో రజకులకు కార్పొరేషన్ లేకుండా చేయడం బాధా కర మన్నారు.రజకులు వివక్షతలుక గురవుతూనే ఉన్నారన్నారు.సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఆలోచన చేసి రజకులకు ప్రత్యేక రజక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.కార్యక్రమంలో రజక సంఘం నాయకులు సైదులు, సట్టు వీరయ్య, రెడ్డిపల్లి వినయ్, నాగరాజు, నాగమణి, నాగలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లింగగిరి వైద్యాధికారి డాక్టర్ పుష్పలత అన్నారు.సోమవారం లింగగిరి పిహెచ్‌సి ఆధ్వర్యంలో మండలంలోని వేపలసింగారంలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు.ప్రజలు తమ ఇండ్లలో ఉండే నీటి తొట్లను ప్రతి శుక్రవారం తప్పనిసరిగా ఆరబెట్టి వాడుకోవాలని,ఇంటి చుట్టు పక్కల పగిలిన కుండలు,జాడీలు,కూలర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ఇంటి చుట్టుపక్కల నీరు ఉన్నట్లయితే చికెన్ గున్యా,డెంగ్యూ వంటి వ్యాధులు దోమల ద్వారా వ్యాప్తి చెందుతాయని తెలియజేశారు.వేసవికాలంలో ప్రతి ఒక్కరు ఉదయం 11 గంటలకు తమ పనులను ముగించుకుని ఇండ్లలో ఉండాలని సూచించారు.ఒకవేళ ఎండకు బయటకు వస్తే తెల్లని టోపీలు,తువాలు నెత్తిపై ధరించి వెళ్లాలని,మంచినీరు అధికంగా తీసుకోవాలని సూచించారు.వేపలసింగారం గ్రామంలో 32 మంది నుండి రక్త నమూనాలను సేకరించి సూర్యాపేట టీ హబ్‌కు పంపినట్లు ఆమె తెలిపారు.కార్యక్రమంలో డాక్టర్ కళ్యాణి,పంచాయతీ కార్యదర్శి గిరిజాకుమారి,ఆరోగ్యసిబ్బంది సావిత్రి, ల్యాబ్ టెక్నీషియన్ రమేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమాలు బలోపేతం చేద్దాం



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు మాజీ బిఆర్ఎస్ నాయకులు పిడమర్తి లింగయ్య సోమవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీలో చేరగా ఆయనకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఆత్మకూర్(ఎస్) మండలం తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన పిడమర్తి లింగయ్య చిన్నతం నుండి జనశక్తి మారోజు వీరన్న వర్గం తరువాత కాలంలో ప్రతిఘటనలో పనిచేసి 2009లో టిఆర్ఎస్‌లో చేరి తెలంగాణ ఉద్యమంలో ముందు భాగానా ఉన్నాడన్నారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులను ఉద్యమంలో మమేకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు , ఐక్యకార్యాచరణ కార్యక్రమాలు చేశాడన్నారు. ఆ ఉద్యమ స్ఫూర్తితో ఇప్పుడు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలన్నారు. పార్టీలో చేరిన కామ్రేడ్ పిడమర్తి లింగయ్య మాట్లాడుతూ పది సంవత్సరాల కాలంలో ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వకుండా బయట నుండి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇచ్చి అసలైన ఉద్యమకారులను నిర్లక్ష్యం చేశారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడటానికి నా మాతృ సంస్థ అయిన విప్లవ పార్టీయే సరియైనదని గుర్తించి ఈ జిల్లాలో ప్రజల తరఫున నిత్యం పోరాడుతున్న విప్లవ పార్టీ సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ అని గ్రహించి చేరడం జరిగిందన్నారు. ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు.కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కారింగుల వెంకన్న, పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక,పిడిఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్,ఐఎఫ్‌టియూ జిల్లా నాయకులు షేక్ సయ్యద్, పద్మ పాల్గొన్నారు.

# ఆకుతాయిలకు షీటీమ్ కౌన్సిలింగ్

ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని విద్యానగర్ 60 ఫీట్ల రోడ్డు నందు షీటీమ్ పోలీస్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. విద్యాసంస్థలు ఉన్న ప్రాంతంలో ద్విచక్రవాహనాలు పెద్ద శబ్దాలతో వేగంగా అస్తవ్యస్తంగా నడుపుతూ విద్యార్థులకు, ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్న ఆకతాయి యువకులను పోలీసులు అదీనంలోకి తీసుకుని వారికి షీ టీఎం కార్యాలయం నందు ఎస్ఐ ప్రవీణ్ కౌన్సిలింగ్ ఇచ్చారు.యువత మంచి



ప్రవర్తన కలిగి భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని, ఉన్నతస్థాయికి ఎదగాలని కోరారు. విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తే ఆకుతాయిలపై ఈవ్‌టీజింగ్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని షీటీమ్ ఎస్ఐ తెలిపారు.

## ఎన్నికల అధికారుల నియామకం





ప్రజాపక్షం/హుజూర్‌నగర్: స్థానిక బార్ అసోసియేషన్‌కు జరగనున్న ఎన్నికల నిర్వహణ నిమిత్తం ఎన్నికల అధికారులుగా న్యాయవాదులు ఎం.ఎస్ రాఘవరావు,వట్టికూటి అంజయ్యల ఎన్నుకుంటూ బార్ అసోసియేషన్ ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాముల రామిరెడ్డి, అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాసరావు సోమవారం విలేకరులకు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ కొనసాగించడానికి పూర్తి అధికారాన్ని ఇస్తున్నట్లు వారు తెలిపారు. ఎన్నికల ప్రధాన అధికారిగా ఎం.ఎస్ రాఘవరావు, సహాయ ఎన్నికల అధికారిగా వట్టికూటి అంజయ్య మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశామని ఈ నెల 18,19 తేదీలలో పోటీచేసే అభ్యర్థుల నుండి నామినేషన్ల స్వీకరణ జరుగుతుందన్నారు.ఈ నెల 20 నామినేషన్ల పరిశీలన, 21న నామినేషన్ల ఉప సంహరణలు ఉంటాయని వారు తెలిపారు.ఈ నెల 26న ఎన్నికల నిర్వహణ ఉంటుందని అదేరోజు సాయంత్రం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు.

## ప్రశాంతంగా ఎన్నికలు జరగాలి



ప్రజాపక్షం/చివ్వెంల: రాబోయే లోక్ సభ ఎన్నికల్లో ప్రతి ఒక్క పౌరులు శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని సూర్యాపేట ట్రైనీ ఐపిఎస్ అధికారి రాజేష్ మీనా అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని బండమీద చందుపట్ల గ్రామంలో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో సిఐఎస్ఎఫ్ సిబ్బంది, పోలీస్‌స్టేషన్ సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ వెంకటరెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ పాస్టర్స్ ఆత్మీయ సమ్మేళనం



ప్రజాపక్షం/సూర్యాపేట: శాంతినగర్ బేతేస్థ మినిస్ట్రీస్ క్యాంపస్‌లో సూర్యాపేట నియోజకవర్గ ఫాస్టర్స్ ఆత్మీయ సమ్మేళనాన్ని సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బిషప్ దుర్గ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్‌ను కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. సిహెచ్ డేవిడ్ బాపట్ల మాట్లాడుతూ యేసుక్రీస్తు ప్రేమ, క్షమాపణపై దైవ సేవకులను వివరించారు. దైవజనులు అందరు కలిసి బిషప్ దుర్గం ప్రభాకర్, కరుణశ్రీ లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంజమూరి గాబ్రియేల్, డాక్టర్ జాన్ మార్క్, ఆజర్య, దేవిడ్‌నాయక్, ఇరుగు సంసోన్, దేవిడ్ బొందుగుల, శాంతయ్య, బి.ప్రశాంత్, లాకునాయక్, జలగం జెమ్స్, గుగులోతు బాలాజీనాయక్, పంది మార్క్, బాబురావు, ఎల్‌కె ప్రభాకర్, బొక్క ఏలియరాజు, ఏర్పుల క్రిస్టోఫర్, జాన్‌పాల్, శాంసన్, శాగ జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

## రిక్షా కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాపక్షం/మునగాల: ప్రతినెల లకుమారపు రత్నమాల పేరుతో సేవా కార్యక్రమాలు చేస్తామని ఆమె భర్త లకుమారపు వరప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఇటీవల కాలంలో గుండెపోటుతో మృతి చెందిన లకుమారపు రత్నమాల జ్ఞాపకార్థం రిక్షా కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ప్రతినెల పేద ప్రజలకు సేవ చేయాలనే దృక్పదంతో త్వరలో ట్రస్టును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లకుమారపు నాగరాజు, శ్రీను, శంకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద లావాదేవీలపై బ్యాంకర్లు దృష్టి సారించాలి

ప్రజాపక్షం/నల్లగొండ : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బ్యాంకర్లు అనుమానాస్పద లావాదేవీలపై జిల్లా స్థాయి గ్రీవెన్స్ కమిటీకి సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో ఎన్నికల వ్యయనిర్వహణలో భాగంగా ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి గ్రీవెన్స్ కమిటీ సమావేశంలో ఆమె బ్యాంకర్లతో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా నగదు తో పాటు ,ఆభరణాలు, వస్తువులను పంపిణీ చేసేందుకు అవకాశం ఉందని, వీటన్నింటి పై గట్టి నిఘా ఉంటుందని తెలిపారు. ప్రత్యేకించి బ్యాంకుల ద్వారా నిర్వహించే అనుమానాస్పద లావాదేవీలపై బ్యాంకర్లు దృష్టి సారించి వివరాలను తక్షణమే పోలీస్ లేదా జిల్లాస్థాయి కమిటీ దృష్టికి తీసుకురావాలని అన్నారు. అదేవిధంగా ట్రాన్స్పోర్ట్ ,ఎక్సైజ్, ఇన్కమ్ టాక్స్, జిఎస్టి శాఖలు వారి వారి శాఖల ద్వారా నిర్వహించే విధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని, ఎక్కడైనా నగదు , ఆభరణాలు వస్తువుల వంటి వాటిని పంపిణీ చేస్తున్నప్పుడు అలాంటి వాటిని స్వాధీనం చేసుకొని తక్షణమే జిల్లాస్థాయి గ్రీవెన్స్ కమిటీకి తెలియజేయాలని చెప్పారు. బ్యాంకుల ద్వారా జరిపే లావాదేవీలకు బ్యాంకర్లు తప్పనిసరిగా ఖాతాదారులకు ఆధారాలు ఇవ్వాలని కోరారు. జిల్లా ఎస్పీ చందనా దీప్తి మాట్లాడుతూ బ్యాంకర్లు అనుమానాస్పద లావాదేవీలతోపాటు, గూగుల్ పే, ఫోన్ పే నుండి ఎక్కువ మందికి మొత్తాన్ని పంపించినప్పుడు ,అదేవిధంగా ఏదైనా షాపులకు ఎక్కువ మొత్తంలో కూపన్లవంటివి ఇవ్వడం చేసినప్పుడు వాటిపై కూడా దృష్టి సారించాలని అన్నారు. అనుమానాస్పద లావాదేవీల పై దృష్టి సారించి ఎప్పటికప్పుడు నివేదికలు పంపించాలని చెప్పారు. ఎక్కడైనా నగదు, మద్యం వంటివి పంపిణీ



చేస్తున్నప్పుడు ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి,వి ఎస్ టి బృందాలకు ఫోన్ కాల్ వస్తే తక్షణమే స్పందించాలని కోరారు. అంతకుముందు జిల్లాస్థాయి లో నగదు,ఆభరణాలు సీజ్ చేయడం, విడుదల చేసే అంశాలపై వివరించారు. సమావేశంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచందర్,జెడ్పి సీఈఓ , జిల్లా స్థాయి గ్రీవెన్స్ కమిటీ నోడల్ అధికారి ప్రేమ్ కరణ్ రెడ్డి,అదనపు ఎస్పీ రాములు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## విజేత కళాశాల విద్యార్థుల ప్రతిభ



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఈనెల 16న మహాత్మగాంధీ యూనివర్సిటీ నల్లగొండ విభాగంలో ఏర్పాటు చేసిన ఈ కామర్స్ యూనివర్సిటీ లెవల్ కాంపిటీషన్స్లో విజేత కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెల్ల ధనుంజయ తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఈనెల 16న నల్లగొండలో నిర్వహించిన ఈ కామర్స్ క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారిని అభినందిస్తూ భవిష్యత్తులో అందరు కూడా ఇదే విధంగా ప్రతిభ కనబరిచి గుర్తింపు పొందాలని అన్నారు. ఇటీవల కాలంలో వచ్చిన సెమిస్టర్ ఫలితాల్లో తమ కళాశాలకు ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మధు, ప్రభాకర్, జ్యోతి, సంధ్య, స్వప్న, బాలాజీ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్సైగా ప్రవీణ్ కుమార్



ప్రజాపక్షం/ శాలిగౌరారం: సెంట్రల్ క్రైమ్ స్టేషన్ నల్లగొండలో విధులు నిర్వహిస్తున్న వాసా ప్రవీణ్ కుమార్ బదిలీపై శాలిగౌరారం ఎస్సైగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. శాలిగౌరారంలో విధులు నిర్వహించిన ఎం ఐలయ్య సి సి ఎస్ నల్లగొండకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

## సెయింట్ జోసఫ్ చర్చి వార్షికోత్సవం



ప్రజాపక్షం/నందికొండ: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక సెయింట్ జోసఫ్ చర్చి 53 వ వార్షికోత్సవాన్ని సోమవారం పారిష్ ప్రీస్ట్ ఫాదర్ మధు ఆధ్వర్యంలో సంఘ సభ్యులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ అమృతవాణి బృందం మూడు రోజులపాటు చర్చి లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాయి. అమృతవాణి డైరెక్టర్ ఫాదర్ సుధాకర్, బ్రదర్ పాట్రిక్ లు చేసిన ప్రధాన ప్రసంగాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో ఆలకించారు. ఆ తరువాత హెరాల్డ్స్ ఆఫ్ గుడ్ న్యూస్ ప్రొవెన్షియల్ ఫాదర్ భత్తుల జయరాజు మాట్లాడుతూ మార్చి నెల సెయింట్ జోసెఫ్కు అంకితం చేయబడిందని,అతని అత్యంత పవిత్రమైన, స్వచ్ఛమైన హృదయానికి ఒక నిర్దిష్టమైన ఆరాధన ఈరోజున అందించబడుతుందని తెలుపుతూ ఏసుక్రీస్తు తండ్రి జోసఫ్ ఔన్నత్యాన్ని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రొవెన్షియల్ రాజశేఖర్, ఫాథర్స్ధనరాజ్,బాలరాజు, హెర్మన్స్, సుందరం, మధు, రాజా, పుష్ప రాజ్, బాలసౌరి, తంబి, పారిష్ బ్రదర్ జోసఫ్, సిస్టర్లు అన్నమ్మ, బాల ట్రీజ, క్లారా, చర్చి పెద్దలు అంతయ్య, ఫ్రాన్సిస్, అనంత్, రామ్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు



ప్రజాపక్షం/కోదాడ: పదవతరగతి పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా ప్రారంభమై ముగిసినట్లు మండల విద్యాధికారి సలీం షరీఫ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.పట్టణంలో మొత్తం 10 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 2,261 విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 2,255 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజర్యారు.విద్యార్థులకు పరీక్షా కేంద్రాల ఇతర సమాచారాల నిమిత్తం హెల్ప్ డెస్కను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## గగన్ హాస్పిటల్లో అరుదైన ఆపరేషన్ విజయవంతం

### 50 సంవత్సరాల మహిళకు అరుదైన మోకాలి ఆపరేషన్ విజయవంతం

ప్రజాపక్షం/చండూరు: నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాలిటీలో ఉన్న గగన్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్లో 50 సంవత్సరాల వయస్సు గల మహిళకు మోకాలి మార్పిడి ఆపరేషన్ను సోమవారం విజయవంతం చేసి చూపించారు గగన్ హాస్పిటల్ డాక్టర్ల వైద్య బృందం. గ్రామీణ మారుమూల ప్రాంతంలో ఉన్న చండూరులో ఇలాంటి అరుదైన చికిత్సలు చేయడం ఇదే మొదటిసారి. గగన్ హాస్పిటల్ లోని డాక్టర్ మల్లికార్జున్ ఆర్థోపెడిక్ ,డాక్టర్ ఉమామహేశ్వర్ ఆర్థోపెడిక్, డాక్టర్ నవీన్ కుమార్ అనస్థీసియా తో కూడిన నిపుణులైన వైద్య బృందం మోకాలి మార్పిడి ఆపరేషన్ను విజయవంతం చేసిన వారిలో ఉన్నారు. ఇలాంటి ఆపరేషన్ చండూరు పట్టణంలో విజయవంతం కావడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.




చండూరు పరిసర ప్రాంత ప్రజలు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చిన గగన్ హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందిస్తున్నారు. చండూరులోని గగన్ మల్టి స్పెషాలిటి ఆస్పిటల్లో అతి తక్కువ వైద్యం ఖర్చులతో మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నట్లు ఇలాంటి అవకాశాలను చండూరు పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని గగన్ మల్టి స్పెషాలిటి హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది.



డాక్టర్ టి. మల్లిఖార్జున్ : తీవ్ర మోకాళ్ళ నొప్పులతో తీవ్రమైన ఇబ్బందులు పడుతు నడువలేక పోతున్న ప్రజలకు మోకాళ్ళ మార్పిడి ఆపరేషన్ వలన ఎంతో ఉపశమనం పొందుతారని ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ టి. మల్లికార్జున్ తెలిపారు. ఇలాంటి ఆపరేషన్లు గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా అందాలనే దృక్పదంతో గ్రామీణ మారుమూల ప్రాంతమైన చండూరులోని గగన్ మల్టి స్పెషాలిటి ఆస్పిటల్ నందు మోకాళ్ళ మార్పిడి ఆపరేషన్ను చండూరులో అందుబాటులో ఉంచామని ఈ అవకాశాలను చండూరు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ టి. మల్లిఖార్జున్ సూచించారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు



ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం పాచిల్ల గ్రామంలో సోమవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఉచితంగా అందించడం జరిగింది. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డా. ప్రత్యూష మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు వారి యొక్క పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధి నుండి పశువులను రక్షించడానికి ఉచితంగా అందించే టీకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతులు టీకాలపై ఎటువంటి అపోహలు లేకుండా వారి యొక్క పశువులకు టీకాలను వేయించాలని సూచించారు. ఈకార్యక్రమంలో వివి ప్రవీణ్ గోపాల మిత్రలు గోవింద్, నరేష్, శేఖర్, రైతులు పాల్గొన్నారు.

## రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్

ప్రజాపక్షం/గుండాల; రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా రైతు వేదికల నుండి రైతులతో వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు నేరుగా మాట్లాడే కార్యక్రమం నేడు ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి లావణ్య తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వరి పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ యాజమాన్య పద్ధతుల గురించి డా. బి. శ్రీనివాస్ ప్లాంట్ బ్రీడింగ్ శాస్త్రవేత్త ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం జగిత్యాల రైతులకు వివరించనున్నారు. అనంతరం రైతుల యొక్క సందేహాలను తీర్చడం, ఆయిల్ఫామ్ సాగులో తీసుకోవాల్సిన మెలకువల గురించి డా. రాజశేఖర్రెడ్డి డీన్ ఆఫ్ అగ్రికల్చర్ శ్రీ కొండ లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతుల సందేహాలు తీర్చడం, వేసవిలో వివిధ కూరగాయల పంటల్లో వాడదగు పురుగుల మందుల వివరాల గురించి డా. కవిత ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎంటమాలజీ ఆధ్వర్యంలో రైతుల యొక్క సందేహాలను నివృత్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్లో రైతులకు క్షేత్రస్థాయిలో అవసరమగు టాపిక్ల గురించి చర్చించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి రైతులు పాల్గొని పంటలకు సంబంధించిన సాగు పద్ధతులను నేర్చుకోవాలని రైతులకు సూచించారు.

## తిరుమలగిరి మున్సిపల్ చైర్పర్సన్ రాజీనామా

ప్రజాపక్షం/తిరుమలగిరి: తిరుమలగిరి మున్సిపల్ చైర్పర్సన్ పోతురాజు రజిని రాజశేఖర్ తన పదవితో పాటు ఐదవ వార్డు కౌన్సిలర్కు రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను జిల్లా కలెక్టర్కు ఫ్యాక్స్ ద్వారా పంపినట్లు ఆమె సోమవారం విలేకరులకు తెలిపారు. తన మున్సిపల్ చైర్పర్సన్, వైస్ చైర్మన్పై బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, బిజెపి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అవిశ్వాసం కోరుతూ జిల్లా కలెక్టర్కు వినతి పత్రం సమర్పించి తీర్మానం అందజేసిన విషయం విధితమే. ఈ కారణంగా ఈనెల 20న కలెక్టర్ అవిశ్వాసం తేదీని ప్రకటించారు. ఈ తరుణంలో చైర్పర్సన్ తన పదవికి రాజీనామా చేయడంతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



## యాదాద్రిని సందర్శించిన నేషనల్ డిఫెన్స్ కాలేజీ బృందం

ప్రజాపక్షం/యాదగిరిగుట్ట: నేషనల్ డిఫెన్స్ కాలేజీ, న్యూఢిల్లీ ద్వారా దేశ, విదేశాలకు చెందిన 16 మంది సభ్యుల బృందం మేజర్ జనరల్ ఎ.కె.సింగ్ ఆధ్వర్యంలో స్టడీ టూర్ ఎకనామిక్ సెక్యూరిటీ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని సోమవారం దర్శించుకుంది. జిల్లా కలెక్టరు హనుమంతు కే.జెండగే, డిప్యూటీ పోలీసు కమీషనర్ రాజేశ్ చంద్ర వారికి స్వాగతం పలికారు. 16 మంది సభ్యుల డిఫెన్స్ బృందం ఆలయ పరిసరాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు గంగాధర్, యాదగిరిగుట్ట దేవస్థాన కార్యనిర్వహణ అధికారి ఎ.భాస్కరరావు, భువనగిరి ఆర్.డి.ఓ.అమరేందర్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

